



జిల్లా సరిహద్దులో తనిఖీలు



గూడెంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

దండేపల్లి డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా మంచిర్యాల-జగిత్యాల జిల్లాల సరిహద్దులోని దండేపల్లి మండలం గూడెంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఎస్ఎస్‌టి అధికారులు పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల ప్రలోభాలకు గురి చేసేందుకు నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువులను తరలించకుండా అడ్డుకట్టవేసేందుకు పకడ్బందీ చర్యలను చేపట్టారు.

తపస్ మండల కమిటీ ఎన్నిక

కోటపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మండల నూతన కమిటీని ఆదివారం కోటపల్లిలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాపర్తి సునీల్‌కుమార్, అడ్డగురి సంతోష్‌కుమార్, దేవులవాడ కాంప్లెక్స్ కన్వీనర్‌గా చేనేని తిరుపతి, కో కన్వీనర్‌గా అడప రఘుకుమార్, మహిళ కన్వీనర్‌గా ఆసరెల్లి పోసక్క, కోటపల్లి కాంప్లెక్స్ కన్వీనర్‌గా జాడి రమేష్‌లను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.

కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

- బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం
- లక్ష్యం మేరకు పనితీరు లేక నిరుపయోగంగా మారిన వైనం
- రూ. 80 కోట్ల మేర ప్రజా ధనం వృథా
- జిల్లాలో పంచాయతీకి ఒకటి చొప్పున నిర్మాణం


నిరుపయోగంగా మారిన వేంపల్లిలోని సెగ్రిగేషన్ షెడ్డు


సెగ్రిగేషన్ షెడ్డులో మద్యం బాటిల్, పేక ముక్కలు

పేకాట నిలయాలుగా సెగ్రిగేషన్ షెడ్లు..!

మంచిర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నివాస గృహాలతోపాటు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లోని వీధుల్లో వెలువడే చెత్తను సేకరించి నిలువ చేసేందుకు ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు ప్రస్తుతం పేకాటకు నిలయాలకు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. కోట్లు వెచ్చించిన ఎంతో ఆర్భాటంగా నిర్మించిన షెడ్లలో లక్ష్యం మేరకు పనితీరులేక నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయి, ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుండటంతో పారిశుధ్య సిబ్బంది దాన్ని గ్రామాలకు దూరంగా తరలించాలనే లక్ష్యంతో 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామ పంచాయతీలో ఒక్కటి చొప్పున వీటి నిర్మాణానికి పూనుకుంది. గ్రామాల్లో సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి అక్కడ తడి, పొడిగా వేరు చేసి, తిరిగి ఉపయోగంలోకి తేవాలని నిర్ణయించింది. అయితే లక్ష్యం మేరకు కార్యాచరణ అమలు చేయకపోవడంతో కోట్లు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు పూర్తిగా నిరుపయోగంగా మారిపోయాయి.

● రూ. 80 కోట్ల అంచనా వ్యయంతో...

జిల్లా వ్యాప్తంగా అప్పటి 311 పంచాయతీల్లో ఒక్కొక్కటి చొప్పున సగటున రూ. 2.8 లక్షల నుంచి రూ. 4 లక్షల అంచనాతో మొత్తం దాదాపు రూ. 80 కోట్ల పై చిలుకు వ్యయంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. షెడ్ల నిర్మాణం పూర్తి కావడంతో వాటిని నిర్వహణ కోసం జిల్లా పంచాయతీ శాఖకు అప్పగించారు. గ్రామాల్లో ఇంటింటా సేకరించిన తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించిన సిబ్బంది దాన్ని సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలి. అక్కడ తడి చెత్తలో సేంద్రియ ఎరువులు తయారు చేసి అవసరం ఉన్న రైతులకు విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యం పెట్టుకున్నారు. అయితే పలు గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది సంఖ్య తక్కువగా ఉండటం, చెత్త సేకరణకు అవసరమైన వాహనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతోపాటు...

(తరువాయి 7లో)

తగ్గేదేలే..
- హామీలిస్తూ బాండ్‌పేపర్లు రాస్తూ
- ఖర్చు ఎంతైనా సర్పంచ్‌గా గెలవాల్సిందే
- ఆలయాల నిర్మాణాలకు విరాళాలు
- కులసంఘాలకు తాయిలాలు

7

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి..
- బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్
- గ్రామస్థులకు పలు సూచనలు

7

సొంత గిడ్డంగి ఉన్నా.. అద్దె భవనంలోనే..
- సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం
- శిథిలావస్థకు చేరిన సొంత గోదాం
- అద్దె భవనానికి వేల రూపాయలు చెల్లింపు

7

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ


చందారం గ్రామంలో ప్రచారంలో కొక్కిరాల సురేఖ

లక్సెట్టిపేట, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే ప్రతీ గ్రామం అభివృద్ధి చెందుతుందని ప్రజలు గమనించి వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. ఈనెల 11న జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల సందర్భంగా మండలంలోని కొత్తూర్, చందారం, హన్మంత్‌పల్లి, బలరావుపేట, జెండావెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధిని కోరుకోవాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం ఎలా ఉంది..ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రెండేళ్ల పాలనలో ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలకు గమనిస్తున్నారన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి అభివృద్ధితో పాటు అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవడం ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్‌గా గెలిపించకోవడం మన బాధ్యత అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, నాయకులు చెల్ల నాగభూషణం, తూముల నరేష్, చింత అశోక్, పూర్ణచందర్ రావు, కందుల మోహన్, రాంబాబు, గుండ బుచ్చన్న పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్


కన్నెపల్లిలో ప్రచారంలో పాల్గొన్న రఘునాథ్

దండేపల్లి డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, కేంద్రం నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రాఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్‌లు అన్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదివారం మండలంలోని కన్నెపల్లి, నంబాల, వెల్గనూర్, ద్వారక, ధర్మరావుపేట, లక్ష్మీకాంతపూర్, గుడిరేవు, తాళ్లపేట, రాజుగూడ, తానిమడుగు గ్రామాలోని పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ బీజేపీ బల పరిచిన అభ్యర్థులందరినీ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండెల రవిగౌడ్, నాయకులు శ్రీనివాస్, ముకేష్ గౌడ్, వెంకటేశ్వర్‌రావు, రాజయ్య, సంతోష్, అనిల్, సురేందర్ పాల్గొన్నారు.

48ఏళ్లకు..ఒక్కచోట చేరి..


అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డ 1976-77 పదోతరగతి విద్యార్థులు

లక్సెట్టిపేట, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు 48ఏళ్ల క్రితం పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒక్కచోట చేరి ఆనందంగా గడిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976-77 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా ఓకే వేదికపై చేరారు. అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇన్నేళ్లకు చిన్న నాటి మిత్రులంతా కలుసుకోవడంతో అందరూ చిన్న పిల్లల్లా మారి హంగామా చేశారు. తాము చదివిన బడి రూపురేఖలు మారడంతో పాఠశాల గదులన్నీ కలియతిరిగారు. చిన్న నాటి మిత్రుడి 60వ పుట్టినరోజు వేడుకలను సైతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పూర్వ మిత్రులు పట్టణ వ్యాపారులు వోజ్జల రవీందర్, సిమెంట్ రవీందర్, సత్యనారాయణ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

శ్రీరాంపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతిచెందిన ఓ వ్యక్తి కుటుంబానికి అతని మిత్రబృందం ఆర్థిక సహాయం చేసింది. శ్రీరాంపూర్ కొత్త రోడ్డులోని గణేష్‌నగర్‌కు చెందిన కాల్వ రాజన్న కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో చనిపోయాడు. అతని మిత్రులు తలా కొంత జమ చేయగా రూ. 1,41,000లు కావడంతో బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బాండ్‌ను మృతుడి భార్యకు ఆదివారం అందించారు. గణేష్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై నిలదీయండి

మందమర్రిటౌన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీని ప్రజలు నిలదీయాలని ఓటు చోరీ వల్లనే కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఓముల ఉపేందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలువార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాలతో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందని అన్నారు. దీంతో అధికారంలోకి వస్తోందన్నారు. తమ నాయకులు రాహుల్‌గాంధీ పెద్దఎత్తున దీనికి వ్యతిరేంగా పోరాడుతున్నాడని అన్నారు. ప్రజలు కూడ వాస్తవాలను తెలుసుకోవాలని ఉద్దేశంతో సంతకాల స్వీకరణ చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో సొత్కు సుదర్శన్, ఉదయ్, ఆంజనేయులుగౌడ్, పోచంపల్లి లక్ష్మీ, లింగన్న, శ్రీనివాస్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : పట్టణంలోని 13వ వార్డు లైన్‌గడ్డ ఏరియాలో ఓటు చోరీ సంతకాల సేకరణ ఉద్యమాన్ని కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ముఖ్యమైనదని తెలిపారు. నియోజకవర్గాల వ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో సరైన పేర్లు, ఫోటోలు లేని లక్షలాది ఎంట్రీలు ఉన్నాయని అవి నకిలీవి అని లక్షలాది పేర్లను తొలగించినట్లు తెలుస్తుందన్నారు.


సంతకాల సేకరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా వెంటనే దిద్దుబాటు చర్యలను తీసుకుని జవాబుదా రితనంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హజు, ఖలీల్, జావీద్, నవాజుద్దీన్, కృష్ణ, ఇబ్రహీం, అన్వర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


మహా పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి దివ్య పదునెట్టాంబడి మహా పడిపూజ కార్యక్రమాన్ని పాత మంచిర్యాల రామాలయ శివాలయంలో కన్నుల పండుగగా నిర్వహించారు. గురుస్వాములు సంగం బట్ల నరహరిశర్మ, అష్టకాల రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలతో పాటు భజన కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో స్వాములు తూముల నరేష్, తూముల వెంకటేష్, బొలిశెట్టి లక్ష్మణ్, ఆమోస్, సతీష్ గౌడ్, ఎర్రం ప్రభాకర్, బొలిశెట్టి కిషన్, పూరేళ్ల హరీష్, పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు


ధండేపల్లిలో పోస్టల్ బ్యాలెట్ వేస్తున్న ఉద్యోగులు

దండేపల్లి డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొదటి విడుత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులు ఆదివారం దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ డబ్బాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు ఓటు వేశారు. రిటర్నింగ్, ప్రీసైండింగ్, పోలింగ్, అదనపు పోలింగ్ అధికారులతో జోనల్ అధికారులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించారు. ఈనెల9 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్ వెల్లడించారు.

అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన

శ్రీరాంపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లో ఆదివారం అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన నిర్వహించారు. సోమవారం ప్రగతి మైదానంలో జరుగనున్న అయ్యప్ప స్వాముల మహా సంగమం, మండల మహా పడిపూజను పురస్కరించుకొని భక్తిగీతాలతో భక్తాంజనేయ ఆలయం నుంచి నగర సంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా పడిపూజకు అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీపీపీ శ్రీరాంపూర్ శాఖ అధ్యక్షుడ బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ శివకుమార్, ఉపాధ్యక్షుడు చకిలం శ్రావణ్, ప్రధాన కార్యదర్శి భాస్కరి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సభ్యుడికి సన్మానం

బెల్లంపల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఇటీవల ఎన్నికైన దుర్గం ఎల్లయ్యను ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకులు పెద్ద పల్లి పార్లమెంటు ఇన్‌చార్జి గోమాస శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీలు సన్మానించారు. దళితుల సమస్యల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎల్లయ్యకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సభ్యుడిగా నియమించడం హర్షనీయమన్నారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో దళితులు అగ్రవర్ణాల చేతిలో అవమానానికి గురవడం చాలా బాధాకరమన్నారు. ప్రస్థుత రోజుల్లో కూడా దళితులపై చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు.


ఎల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఆట కట్టించే..హంటర్ డాగ్

కలప స్మగ్లర్ల పాలిట సింహస్వప్నం

చెన్నూరు, కోటపల్లి రేంజ్‌లలో హంటర్ డాగ్‌తో అటవీ అధికారుల హల్‌చల్


హంటర్ డాగ్

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణలో ఈ హంటర్ డాగ్ కీలకం కానుంది. కలప స్మగ్లర్లకు సింహస్వప్నంలా నిలుస్తున్న హంటర్ డాగ్ (వేటకుక్క)ను పులుల సంరక్షణతో పాటు అటవీ సంరక్షణకు అటవీ అధికారులు దీన్ని ఇటీవల ఈ ప్రాంతానికి తీసుకువచ్చారు. 11 నెలల వయస్సు కలిగిన ఈ శునకం మనుషుల కంటే 200 రెట్లు అధికంగా వాసన పసిగట్టే శక్తి 20 రెట్లు అధికంగా వినికిడి శక్తి కలిగి ఉంది. ఈ హంటర్ డాగ్‌కు హర్యాణాలో శిక్షణ ఇప్పించినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. అర్ధరాత్రి అడవిలో చెట్లను ఎవరైనా కొట్టివేసినా హంటర్ డాగ్ అలాంటి వారి ఆట కట్టేస్తుంది. చెట్లను కొట్టేసిన ప్రాంతానికి హంటర్ డాగ్‌ను తీసుకువెళితే అది వాసన చూస్తుంది. దాంతో ఎన్ని కిలోమీటర్ల దూరంలో స్మగ్లర్లు ఉన్నా వెతికి మరీ పట్టుకుంటుంది. అలాగే అడవిలో జంతువుల వేట చేసినా, కలప స్మగ్లింగ్ చేసినా ఆ ప్రాంతానికి వెళ్లి వాసన చూసి గంటల వ్యవధిలోనే స్మగ్లర్లను పట్టుకునేలా ఈ డాగ్‌కు శిక్షణ ఇప్పించారు. ఈ డాగ్‌కు హిందీతో పాటు ఇంగ్లీష్ లో చెప్పిన సూచనలను ఇది పాటిస్తుంది.

హంటర్ డాగ్ మెనూ ఇలా...

హంటర్ డాగ్‌కు అందించే ఆహారం కూడా నాణ్యతతో కూడుకుని ఉంది. ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల మధ్య దీనికి అల్పాహారం ఇస్తా రు. ఇందులో ఉడికించిన కోడిగుడ్డు, అరలీటరు పాలు, 200 గ్రాముల జొన్న, మొక్కజొన్న గట్క, క్యారెట్, బీట్‌రూట్, పాలకూర, క్యాబేజీ కలిపి వంద గ్రాములు ఉడికించి ఇస్తారు. అప్పుడప్పుడు స్నాక్స్ ఇస్తారు. సాయంత్రం 6 గంటలకు 250 గ్రాముల రైస్, 350 గ్రాముల మాంసం, 100 గ్రాముల కూర గాయలను ఉడికించి హంటర్ డాగ్‌కు అందిస్తారు.

శిక్షణ ఇలా..

ప్రతి రోజు ఇది ఉదయం 5.30 గంటలకు నిద్ర లేస్తుంది. 30 నిమిషాల పాటు శిక్షణకు కేటాయిస్తారు. 6 నుంచి 7.30 గంటల మధ్యలో వ్యాయామం చేయిస్తారు. ఆ తర్వాత అరగంట పాటు మాలిష్ చేసి 8 నుంచి 9 గంటల వరకు విశ్రాంతి కల్పిస్తారు. అటవీ ప్రాంతంలో ఏదైనా నేరం జరిగి నట్లు సమాచారం వస్తే ఫీల్డ్‌కు తీసుకువెళ్లారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5 గంటల వరకు మైదానంలో ఆటలు ఆడిస్తారు. దీనికి తర్ఫీదు ఇచ్చేందుకు ఇద్దరు బీట్ అధికారులకు సైతం 7 నెలల పాటు శిక్షణ అందించారు.

చెన్నూరులో గాలింపు...

హంటర్ డాగ్‌తో రెండు వారాల క్రితం చెన్నూ రు, కోటపల్లి రేంజ్‌లలోని అటవీ ప్రాంతాల్లో శిక్షణ పొందిన బీట్ అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. చెన్నూరు ప్రాంతంలోని అంబేద్కర్ అర్బన్ ఏకో పార్కు, జోడు వాగులు, శివ్వారం మొసళ్ల అభయారణ్యంతో పాటు చెన్నూరు, కోటపల్లి రేంజ్‌ల పరిధిలోని అడవుల్లో దీంతో గాలింపు చర్యలు చేపట్టారు.


అడవుల్లో హంటర్ డాగ్‌తో గాలింపు చర్యలు చేపడుతున్న అధికారి

ఎల్లమ్మ, మార్కండేయ ఆలయాల్లో చోరీ



పగులగొట్టిన హుండీ

హాజీపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాపల్లి పునరావాస కాలనీలోని రేణుక ఎల్లమ్మ, మార్కండేయ ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు ఎల్లమ్మ ఆలయంలోని అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న బంగారు పుస్తెలు, మార్కండేయ ఆలయంలో హుండీని పగులగొట్టి అందులో ఉన్న వెండి ప్రతిమలు, నగదు చోరీ చేసినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 50 వేల వరకు ఉంటుందన్నారు. సమాచారం అందుకున్న హాజీపూర్ ఎస్ఐ స్వరూపరాజ్ డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంల ద్వారా విచారణ చేపట్టారు. గ్రామస్థుడైన శంకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు హెచ్‌పీసీ కార్డులు

- ప్రోగ్రెస్ కార్డు విధానంలో మార్పులు
- పాఠశాలల్లో అమలుకు నిర్ణయం



కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వార్షిక పరీక్షల అనంతరం విద్యార్థులు సాధించిన సబ్జెక్టుల వారీగా మార్కులు, హాజరు శాతం తెలిపేవిధంగా విద్యాశాఖ ప్రోగ్రెస్ కార్డులిచ్చేది. ఈ మేరకు విద్యా సంస్థల్లో అందిస్తున్న ప్రోగ్రెస్ కార్డు విధానం మారనుంది. కేవలం మార్కులకే పరిమితమైన ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులో ఇక నుంచి అన్ని రకాల అంశాలు కూడుకుని ఉండేలా విద్యాశాఖ హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు (హెచ్‌పీసీ)ని రూపొందించింది. జాతీయ విద్యా విధానం ఎన్ఈసీ-(2020)లో ప్రతిపాధించిన విద్యా సంస్కరణల్లో భాగంగా విద్యార్థుల మూల్యాంకన విధానంలో సమూ ల మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకు పరాక్ (పర్‌ఫార్మెన్స్ అస్సెస్‌మెంట్ రివ్యూ) అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ విధానం ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు కొనసాగుతున్న సమ్మేటివ్ విద్యార్థుల బట్టీ విధానానికి స్వస్తి పలకనున్నారు. విద్యార్థుల్లో విశ్లేషణ, విమర్శనాత్మక ఆలోచనలకు భావనాత్మక స్పష్టత వంటి ఉన్నత స్థాయి విద్యా నైపుణ్యాలను పరీక్షించే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం ఇందులో నమోదు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా యూఆర్ఎస్-1, మోడల్ స్కూల్స్-2, కేజీబీవి-15, ప్రభుత్వ ప్రైమరీ స్కూల్స్-528, అప్పర్ ప్రైమరీ-100, లోకల్ బాడి ప్రభుత్వ పాఠశాలలు-60 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 40,436 మంది విద్యార్థులు ఈ కార్డు లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటారు. వీటితో పాటు అన్ని ప్రైవేటు పాఠశాలల్లోను ఈ విధానం అమలు కానుంది. ఈ విషయంలో డీఈవో ఆధ్వర్యంలో చర్చించినట్లు, త్వరలోనే ప్రతీ ఒక్క విద్యార్థికి హెచ్‌పీసి కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

పూర్తి వివరాల నమోదు

పాఠశాలల్లో కొత్తగా ఇచ్చే హెపీసీ కార్డు విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేసేదిగా ఉంటుందని వ్యక్తిగత వివరాలు, శారీరక, మానసిక సామర్థ్యాలు, అవగాహణ, సున్నితత్వం, పాఠశాలల్లో నిర్వహించే కృత్యాల్లో ప్రతిభ, ప్రశ్నలపై సమయస్ఫూర్తి, తదితర వివరాలు నిక్షిప్తం చేయనున్నారు. ఈ విధానం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలతో పాటు మోడల్, గురుకుల, నవోదయ, తదితర అన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు త్వరలోనే అన్ని పాఠశాలలో అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా విద్యా శాఖ ఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు.

వ్యాపారితో గొడవ.. కేసు నమోదు

నెన్నెల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొళ్లపల్లి గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి గడ్డం సత్యాగౌడ్‌తో గొడవ పడి చంపుతానని బెదిరించిన అదే గ్రామానికి చెందిన కాల్వ సతీష్‌పై ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. రైతు వెంకటి వద్ద ధాన్యం కొనుగోలు చేసి బస్తాలు కాంటా వేసిన తర్వాత అతడి కొడుకైన సతీష్ లోడింగ్‌ను అడ్డుకొని గొడవకు దిగాడని చెప్పారు. వారించేందుకు ప్రయత్నించిన హమాలీలను సైతం దుర్భాషలాడాడని పేర్కొన్నారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుడుంబా

కాసిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లంబాడితండా(డీ)లో ఆదివారం దేవాపూర్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గ్రామ శివార్లలో గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ గంగారాం స్థావరాలపై దాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లం పానకంతో పాటు తయారు చేసే పాత్రలను ధ్వంసం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రజలందరు సహకరించాలని కోరారు. దాడుల్లో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పల్‌నవేగాం స్టాఫ్ వద్ద తనిఖీల్లో సాలెగూడ గ్రామానికి చెందిన నాగోసే సాగర్ అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్ తెలిపారు. ఈ దాడిలో ఎస్సై రాజు, పోలీసు సిబ్బంది సంజీవ్, దేవేందర్, శేఖర్ పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ, బాబాపూర్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందు మోతుగూడ గ్రామానికి చెందిన ఎర్గండి వినోద్ 30 మంది వ్యక్తులతో కలిసి ఈ నెల 5న నామినేషన్ కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహించడంతో ఎఫ్ఎస్‌టీ టీం డిప్యూటీ తహసీల్దార్ రాజకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. బాబాపూర్‌లో సైతం కవల్కర్ సుభాష్ 30 నుంచి 35 మందితో నామినేషన కేంద్రం వద్ద అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విశ్రాంత కార్మికులకు ప్రయోజనాలు అందించాలి

శ్రీరాంపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి విశ్రాంత కార్మికులకు రావాల్సి న ప్రయోజనాలు అందించి, పెండింగ్‌లో ఉన్న వారి సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పెన్షన్ తక్కువగా రావడమే కాకుండా ఇచ్చేది కూడా సక్రమంగా అందించడం లేదని తెలిపారు. పెన్షన్ పెంపుకోసం కోర్టును ఆశ్రయించాల్సిన అగత్యం ఏర్పడిందని పేర్కొన్నారు. అధికారులకు రూ.25 లక్షల వైద్య ఖర్చుల పరిమితితో పాటు ఏటా 36 వేల రూపాయలు వైద్య భత్యం అందిస్తున్నారని తెలిపారు. అదే సమయంలో కార్మికులకు మాత్రం రూ.8 లక్షల వైద్య పరిమితిని మాత్రమే అందిస్తున్నాయనని పేర్కొన్నారు.. అధికారులు, కార్మికులకు వైద్య ఖర్చుల్లో తేడా ఎందుకని ఆయన ప్రశ్నించారు. గ్రాట్యుటీ అమలు చేయడంలోనూ అన్యాయమే జరుగుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2016 నుంచి, సింగరేణి అధిఖరులకు 2017 నుంచి అమలు చేస్తూ కార్మికులకు మాత్రం 2018 నుంచి ఇవ్వడం ఎంతమేరకు సమంజసమని పేర్కొన్నారు. పెన్షన్ పెంపును ప్రతీ మూడేళ్లకోసారి సమీక్షించాలని, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని, గ్రాట్యుటీ పెంపును 2016 నుంచే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా షష్టి బోనాలు



ఆలయ ప్రాంగణంలో నైవేద్యం వండుతున్న భక్తులు

కాగజ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివమ ల్లన్న ఆలయ ప్రాంగణంలో ఆదివారం షష్ట బోనాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలైన సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూరు, పెంచికలపేట, చింతలమానేపల్లి, దహెగాం, రెబ్బెన, ఆసిఫాబాద్ మండలాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి ఆలయ ప్రాంగణంలో నైవేద్యం వండి బోనాలు సమర్పించారు.

అడవుల్లో పర్యటించి.. వివరాలు తెలుసుకుని..

బెజ్జూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ దూలపల్లి ఫారెస్టు అకాడమీలో శిక్షణ పొందుతున్న 38 మంది బీట్ అధికారులు ఆదివారం బెజ్జూరు అడవుల్లో క్షేత్ర పర్యటన నిర్వహించి వివరాలను తెలుసుకున్నారు. ఫీల్డ్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ స్థానిక అటవీ అధికారుల బృందంతో ఇక్కడి అటవీ ప్రాంత ప్రాముఖ్యతను వివరించారు. మండలంలోని కుశ్నపల్లి సెక్షన పరిధిలోని ఇందుర్‌గాం బీట్‌లోని రాముడు, భీముడు టేకు చెట్లు, బేస క్యాంపును పరిశీలించారు. అనంతరం మాణిక్యాదేవర అటవీ ప్రాంతంలో పులుల ఆవాస ప్రాంతాన్ని పరిశీలించారు. పులుల కదిలికలు, వాటి పాద ముద్రలు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పెద్దపులి ఎటు నుంచి ఎటు వైపు వెళ్తుందో పాదముద్రల ఆధారంగా గమనిస్తూ వెళ్లారు. ఇక్కడి అటవీ ప్రాంత జీవవైవిద్యంతో కూడిందని వివరించారు. ఈ ప్రాంతంలో వివిధ రకాల పక్షులు, వన్యప్రాణుల గురించి శిక్షణ పొందుతున్న వారికి అవగాహన కల్పించారు. వారి వెంట రేంజ్ అధికారి ముసావీర్, డిప్యూటీ ఆర్వో శ్రావణ్, సెక్షన్ అధికారి సోఫియా, బీట్ అధికారి గోపాల్ తదితరులు ఉన్నారు.



బెజ్జూరు అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న శిక్షణ అధికారులు

వసతులున్నా.. వినియోగం కరువు



గోలేటిలోని భీమన్న స్టేడియం

రెబ్బెన, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేసే వారి సంక్షేమంతో పాటు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని యజమాన్యం గోలేటి ప్రాంతంలో అనేక సదుపాయాలు కల్పించింది. మెరుగైన క్రీడా సౌకర్యాలు సమకూర్చింది. కానీ వాటిని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోలేక పోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. బెల్లంపల్లి ఏరియాలో గోలేటి-1 ఇంక్లైన్, గోలేటి-1ఏ ఇంక్లైన్, గోలేటి-2 భూగర్భ గనితో పాటు కైరిగూడ ఓసీపీ, డోర్లి-1, డోర్లి-2, ఓపీఏ ఓసీపీ-2 ఒపెన్ ఖాస్టులు నడుస్తున్న క్రమంలో ఏడు వేల మందికి పైగా సింగరేణి ఉద్యో గులు పని చేస్తుండేవారు. ఆ సమయంలోనే ఇక్కడ వారికి అనేక క్రీడా సౌకర్యా లు ఏర్పాటు చేశారు. కాల క్రమంలో ప్రస్తుతం ఒక కైరిగూడ ఓసీపీ మాత్రమే కొనసాగుతోంది. దంతో ఉద్యోగుల సంఖ్య 925కు పడిపోయింది. కొత్తగా గోలేటి ఓపెన్ కాస్టు ప్రారంభమైతే తప్ప పూర్వ వైభవం వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు.

అందుబాటులో ఆట స్థలాలు..

క్రీడా స్థలాలకు అనుకున్న స్థాయిలో క్రీడాకారులు రాక బోసి పోతున్నాయి. గోలేటి భీమన్న మైదానంలో వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, లాన టెన్నిస్, పుట్‌బాల్, హకీ కోర్టు ఏర్పాటు చేశారు. గోలేటి సీఈఆర్, ఆఫీసర్ క్లబ్‌లలో ఉడెన్ షటిల్ కోర్టు, టేబుల్ టెన్నీస్, కార్యమ్, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికను నెలకొల్పారు. సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులు తీర్చిదిద్దారు. వ్యాయామం కోసం గోలేటి సీఈఆర క్లబ్ ఆవరణలో జిమ్, ఈతకొలను ఏర్పాటు చేశారు. ఆఫీసర్ క్లబ్‌లో ఇండోర షటిల్ కోర్టు, ధ్యానం కోసం రెండు పిరమిడ్ కేంద్రాలు, కోదండరామాలయం ఎదుట ప్రత్యేకంగా ఉద్యానవనం ఏర్పాటు చేసి పిల్లల ఆట వస్తువులను సమకూర్చారు.

గ్రామం చిన్నదే అయినా...

గోలేటి గ్రామం చిన్నదైనా ఇక్కడి నుంచి ఎంతో మంది అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాఇ క్రీడా పతకాలు సాధించారు. కోలిండియా సాధయిలో పసిడి పతకాలు సాధించారు. గోలేటి సింగరేణి పాఠశాలలో చదివే విద్యార్థులు ఎక్కువగా క్రీడల్లో ప్రతిభ కనబరుస్తుంటారు. వివిధ క్రీడల్లో వంద మందికిపైగా క్రీడాకారులు జాతీయ స్థాయికి పరిచమయ్యారు. స్కాట్స్ అండ్ గైడ్స్‌లో రాష్ట్రపతి, గవర్నర అవార్డులు సొంతం చేసుకన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి, సింగరేణి క్రీడల సమయంలో మాత్రం ఇక్కడి ఆట స్థలాలు కళకళలాడుతుంటాయి. యాజమాన్యం అందుబాటులో ఉంచిన మైదానాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు, యువత క్రీడల్లో రాణిస్తే గోలేటికి మరింత పేరు వచ్చే అవకాశం ఉంటుంది.

వణికించే చలిలో ‘పంచాయతీ’ వేడి

- ఉదయం నుంచే వీధుల్లో నేతల పర్యటన
- ఓటర్లను పలకరిస్తూ సందడి

బెజ్జూరు/వాంకిడి, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ బరిలో నిలిచే ఆశావహులు పొద్దు పొద్దుగాళ్ల గ్రామంలో ప్రచారానికి కదులు తున్నారు. చలిలో సైతం సర్పంచులు, వార్డు సభ్యులుగా పోటీ చేసే వారు కాలనీలోకి వెళ్తున్నారు. ఎన్నడూ కనిపించ ని వారు వారి వారి కాలనీల్లో ప్రత్యక్షం కావడంతో ఎటు వచ్చారు అన్న అంటూ పలకరిస్తున్నారు. అయితే ఓట్లు అడిగే వారు మాత్రం అన్నా బాగున్నారా...! అంటూ ఇంటి దగ్గరికి వెళ్లి ఓటర్లను పలుకరింపులు మొదలయ్యాయి. గీ.. అన్న.. గిప్పుడు వచ్చిం డేంది. అసలు ఇటు ఎందుకు వచ్చినట్లు అని ఒకరినొకరు ముచ్చట్లు పెడ్తున్నరు. అరె ఓట్ల పండగ గదుల్లో.. గెల్వనీకి ఓట్ల కోసం వస్తున్నరేమో అని మాట్లాడుకుంటున్నరు. ఇగ సదువుకునే పిల్లలతే అమ్మ, ఆయనకు మనం ఇప్పుడు గుర్తుకు వచ్చామా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నరు. ఇక పోటీ చేసే వారేమో ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు ఓటేసి ఆదరించడం అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.



కలిసిరాని రిజర్వేషన్లు..

ఎన్నికలలో పోటీ చేస్తామని ముందుకు చూపుగా ఎందో మంది సేవా కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచి పదవీవిపై గురి పెట్టి సేవా కార్యక్రమాలు చేసిన వారిని రిజర్వేషన్లు కలిసి రాక పోవడంతో నిరాశకు లోనవుతున్రాఉ. గణపతులు, దుర్గాదేవి, బతుకమ్మలకు చందాలు ఇచ్చిన నాయకులు రిజర్వేషన్ దెబ్బతో సైలెంట్ అయ్యారు. అయినా ఎంపీటీసీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు కలిపివస్తాయన్న ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏదైమైనా ఆశల పల్లకిలో ఉన్న నాయకుల భవిష్యత్ అయినా బాగుంటుందన్న భావనతో ఉన్నారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో అభ్యర్థులు ప్రచార జోరు పెంచుతున్నారు. ఎలాగైనా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, వారి అనుచరులు సుడిగాలి ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో లాగా ఎక్కడ పడితే అక్కడ గోడలపై రాతలు రాయడం, బ్యానర్లు, ఫెక్సీలు కట్టడం లేకపోవడంతో ప్రచార రథాలను గ్రామాల్లోకి తిప్పుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వారి వద్దకు నేరుగా వెళ్లి కలుస్తున్నారు. పల్లెల్లో ప్రస్తుతం పత్తి ఏరివేత ఉండడంతో ఉదయాన్నె రైతులు పొలం బాట పడుతున్నారు. దీంతో కోడి కూయక ముందే అభ్యర్థులతో పాటు వారి అనుచరులు గ్రామాల్లో వాలి పోతున్నారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ అం దుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని, గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూతపడుతున్న సూపర్‌బజార్లు

- అందని సరుకులు
- కార్మికులకు ఇబ్బందులు
- నిర్వహణాలోపమే కారణం



నస్పూర్‌లో మూతపడిన సూపర్‌బజార్

శ్రీరాంపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికులకు నాణ్యమైన సరుకులను తక్కువ ధరలో అందించాలని ఏర్పాటు చేసిన సూపర్ బజార్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. కార్మికులకు సరుకులు అందకపోవడంతో అధిక ధరలు వెచ్చించి ప్రైవేటు స్టోర్లలో కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నారు. కార్మికులకు అవసరమైన నాణ్యమైన సరుకులు, ఇతర వస్తువులు అందించాలనే తలంపుతో అప్పటి సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ 1974 డిసెంబరు 5న "సింగరేణి కాలరీస్ వినియోగదారుల సహకార సంఘం లిమిటెడ్"ను రిజిష్టర్ చేశారు. ఈ సంస్థ ద్వారా ఏరియాల వారీగా బియ్యం, పప్పులు, నూనె, మిగతా అన్ని రకాల నిత్యావసర సరుకులు అందించేందుకు సూపర్ బజార్లు ఏర్పాటు చేశారు. ఈ సూపర్ బజార్ల ద్వారా కార్మికులు నెలకు రూ.10 వేల వరకు క్రెడిట్‌పై సరుకులు కొనుగోలు చేస్తే తదుపరి నెల వేతనంలో మినహాయించుకునే అవకాశం ఉండేది. దీనివల్ల కార్మికులకు ఆర్థికంగా వెసులుబాటు ఉండగా, నాణ్యమైన సరుకులు అందేవి. తరువాత కాలంలో టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, కూలర్లు, వంటి అనేక వస్తువులను అందుబాటులో ఉంచారు. సూపర్‌బజార్లకు ఏరియాల వారీగా కార్మికుల తాకిడి ఎక్కువగా ఉండడంతో కాలనీల వారీగా మినీ సూపర్ బజార్లు ఏర్పాటు చేశారు. సింగరేణిలోని 11 ఏరియాల్లో 30 వరకు మినీ సూపర్ బజార్లు ఉండేవి. అయితే నిర్వహణాలోపాలు, ఇతర కారణాలతో వీటిని పూర్తిగా మూసివేశారు.

సింగరేణి నుంచి..

కోఆపరేటివ్ సంస్థకు సింగరేణి నుంచి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), డివిజనల్ మేనేజర్లు(డీఎం), ఇతర ముఖ్యమైన సిబ్బంది ఉన్నారు. సంస్థకు అవసరమైన పర్మనెంట్ సిబ్బందిని నియమించుకుని పనులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సైతం పనిచేస్తున్నారు. ఇందులో చాలా మంది సూపర్ బజార్లు, మినీ సూపర్ బజార్లు నిర్వహించేవారు. అయితే సరుకులు తీసుకోవడమేగాని, వాటిని అమ్మిన తరువాత నగదును సంస్థ ఖాతాల్లో జమ చేయడంలో నిర్లక్ష్యం చేసేవారు. నిర్వాహకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించకపోవడంతో వారి వద్ద రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయి. కొన్ని చోట్ల క్రమశిక్షణా చర్యలు తీసుకున్నప్పటికీ డబ్బులు మాత్రం పూర్తిస్థాయిలో రికవరీ కాలేదు. ఇప్పటికీ చాలా చోట్ల విచారణలు కొనసాగుతూనే ఉన్నాయి. డబ్బులు సంస్థకు చెల్లించకుండా మోసానికి పాల్పడ్డ ఉద్యోగులు కొందరు రిటైర్ కాగా, వారి నుంచి డబ్బులు రికవరీ చేయడంలో సంస్థ నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారు. దీనిని ఆసరాగా తీసుకొని మోసానికి పాల్పడ్డ ఉద్యోగులు దర్జాగా ఉంటున్నారు. పైగా తమకు రావాల్సిన ఉద్యోగ ప్రయోజనాలు ఇవ్వాలని నోటీసులు పంపిస్తున్నారు.

ఉద్యోగుల కొరత తీవ్రం

సూపర్‌బజార్ల నిర్వహణకు అవసరమైన ఉద్యోగులు సంస్థలో అవసరమైన మేరకు లేరు. ఇప్పటి వరకు పనిచేసిన వారు రిటైర్ అవుతుండగా, వారి స్థానంలో కొత్తగా ఎవరినీ తీసుకోవడం లేదు. దీంతో ప్రస్తుతం ఉన్న అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. ఫలితంగా పనులు త్వరగా పూర్తి కావడం లేదు. సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా తయారైంది.

రీజియన్ పరిధిలో...

బెల్లంపల్లి రీజియన్ పరిధిలో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లం పల్లి ఏరియాలు ఉన్నాయి. ఇందులో శ్రీరాంపూర్‌లో సుమారు 10 వేల మంది, మందమర్రిలో 5 వేల మంది, బెల్లంపల్లిలో 2 వేల మంది వరకు పనిచేస్తున్నారు. వీరి కుటుంబాలకు గతంలో సింగరేణి సూపర్ బజార్ల ద్వారా సరుకులు అందేవి. శ్రీరాంపూర్, నస్పూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి, గోలేటిలలో ఒక్కో సూపర్ బజార్ నిర్వహించేవారు. గతేడాది డిసెంబర్‌లో జైపూర్‌లోని పవర్ ప్లాంట్(ఎస్‌టీపీపీ)లో నూతనంగా సూపర్‌బజార్ ఏర్పాటు చేశారు. ఇందులో ఎస్‌టీపీపీ మినహా మిగతావన్నీ మూతపడ్డాయి. నిత్యావసర సరుకులు పంపిణీ కాకపోయినా, గ్యాస్ సిలిండర్లు మాత్రం అందుతున్నాయి.

నూతన స్టోర్లు నిర్మిస్తే మేలు..

సింగరేణి సంస్థకు కొన్ని లక్షల ఎకరాల్లో స్థలాలున్నాయి. చాలా చోట్ల ఆక్రమణకు గురవుతున్నాయి. మరికొన్ని వృథాగా పడి ఉన్నాయి. యాజమాన్యం ఆయా స్థలాలను కో ఆపరేటివ్ సంస్థకు అప్పగించి ప్రైవేటు సంస్థల మాదిరిగా పెద్ద ఎత్తున మాల్స్ నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. అన్ని రకాల నాణ్యమైన వస్తువులు సరైన ధరకే అందే అవకాశం ఉంటుందని, సంస్థకు భారీ ఎత్తున ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని చెప్తున్నారు. పెట్రోలు బంకులు, సోలార్ పవర్, లోహ ఖనిజాన్వేషణ, ఎన్నో ఇతర వ్యాపారాలకు విస్తరిస్తున్న సింగరేణి మాల్స్‌లోకి సైతం ప్రవేశించి లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. అలా కుదరకపోయినా ఇప్పుడున్న స్టోర్లలో సమస్యలు పరిష్కరించి సక్రమంగా నడిపిస్తే అదే పదివేలని సింగరేణి ఉద్యోగులు పేర్కొంటున్నారు. సంస్థ నిర్వాహకులు నిర్లక్ష్యం వీడి వ్యవస్థను గాడినపెట్టే పనిలో పడాలని సూచిస్తున్నారు.

ఎన్నికల్లో పోలీసులకు సహకరించాలి

తాండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, పార్టీల నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతిలేకుండా అనవసరంగా గుంపులుగా ఉండడం, ర్యాలీలు చేపట్టవద్దన్నారు. ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురి చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల అడ్మిన్‌లు జాగ్రత్తగా ఉండాలని, చట్టవిరుద్ధమైన, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చర్యలుంటాయన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరు సహకరించాలన్నారు.

రాష్ట్రస్థాయిలో ఖోఖో పోటీల్లో ప్రతిభ

కాసిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో కాసిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న మడావి కీర్తన అన్ని విభాగాల్లో రాణించి సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల పీడీ బాబురావు తెలిపారు.


మడావి కీర్తన (ఫైల్)

ఆదివారం హైద్రాబాద్‌లో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీల్లో కీర్తన పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. విద్యార్థినిని డీఐఈవో అంజయ్య, కళాశాల ప్రిన్సిపల్ శంకర్ అధ్యాపకులు అభినందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఈనెల 3న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు నమిలికొండ సత్తయ్య(65) ఆదివారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని సత్తయ్య ఈనెల 4న రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కిష్టునాయక్ తండాకు చెందిన యువకుడు గుగులోతు విజయ్ బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయలపాలైన వృద్ధుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రవ్వ, కొడుకులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తగ్గేదేలే..



- ఖర్చు ఎంతైనా సర్పంచ్‌గా గెలవాల్సిందే
- ఆలయాల నిర్మాణాలకు విరాళాలు
- కులసంఘాలకు తాయిలాలు

బెల్లంపల్లి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పంచాయతీపోరు వేడెక్కుతోంది. గెలుపు, ఏకగ్రీవాల కోసం అభ్యర్థులు హామీల వర్షం కురిపిస్తున్నారు. డబ్బులు ఎంతైన ఖర్చుపెట్టడానికి వెనుకాడడం లేదు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచేందుకు పలువురు అభ్యర్థులు వినూత్న పద్ధతులను అవలంభిస్తున్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు తమ హామీలకు సంబంధించిన బాండ్లల రాయిస్తూ ప్రజల్లో నమ్మకం ఏర్పడేలా ముందుకు సాగుతున్నారు. మరికొందరు ఆడపిల్లలు పుడితే వారి పేరి ట నగదు అందిస్తామని ప్రకటిస్తున్నారు. మరికొంత మంది ఆపదలో ఉన్నవారికి అండగా నిలువడంతో పా టు మరణించిన కుటుంబానికి ఆర్థిక సాయం చేసేం దుకు, ఆరోగ్యబీమా ఇప్పిస్తామని హామీలు ఇస్తున్నారు. సర్పంచ్ పోటీల్లో గెలుపు తప్ప ఓటమి ఉండకూడదని హామీలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

బాండ్ పేపర్లపై...

ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు ఎలాగైన సర్పంచ్‌గా గెలిచితీరాలనే ఉద్దేశంతో ఖర్చు ఎంతైన వెనుకాడడం లేదు. ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిచితీరాలనే పట్టుదలతో ఒకరిని మించి మరొకరు ముందుకు సాగుతున్నారు. చిన్న పంచాయతీల్లో రూ. 5లక్షల నుంచి పది లక్షల వరకు ఖర్చుకు సిద్ధమవుతుండగా మేజర్ పంచాయతీల్లో రూ.10లక్షల నుంచి 20 లక్షల ఖర్చుకు సైతం వెను కాడడం లేదు. ఏకగ్రీవం కోసం ఆయా గ్రామాల్లో పూర్తి ఖర్చులతో ఆలయాలు నిర్మిస్తామని పెద్దల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. యువత కోసం క్రీడా సామగ్రి హామీలు ఇస్తూ ప్రసన్నం చేసుకుంటున్నారు. మరికొంత మంది గ్రామ అభివృద్ధి కుల సంఘాల వారికి ఎర చూపుతూ ముందుకు వెళ్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈసారి తనని సర్పంచ్‌గా ఎన్ను కుంటే వచ్చేసారి నిన్ను ఎన్నుకుంటామంటూ గ్రామ అభివృద్ధి కోసం ఐదు నుంచి పది లక్షలు ఖర్చు చేస్తామని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.

- ఇంటి పన్ను మాఫీ చేస్తాం.. పింఛన్ ఇప్పిస్తాం

సర్పంచ్ పదవి కోసం ఆయా అభ్యర్థులు ఎన్నికల్లో గెలిచేందుకు వినూత్న పద్ధతులను అవలంభిస్తున్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు తమ హామీలకు సంబంధించిన కరపత్రాలు ముద్రిస్తున్నారు. మరికొందరు సర్పంచ్‌లు బాండ్‌లు రాసిస్తూ ప్రజల్లో నమ్మకం ఏర్పడేలా ముందుకు సాగుతున్నారు. ఈ హామీల్లో భాగంగా ఆడ పిల్లలు పుడితే వారి పేరిట నగదు అందిస్తామని ప్రకటిస్తున్నారు. అలాగే వివాహ సమయాల్లో మట్టెలు, పుస్తెలను ఇస్తామని తెలుపుతున్నారు. పలువురు అభ్యర్థులు ఆరోగ్యబీమా చేయిస్తామని ఆపదలో అండగా ఉంటామని పేర్కొంటున్నారు. ఇంకొందరు సర్పంచ్‌గా గెలిపిస్తే ఇంటి పన్ను మాఫీ చేస్తామని అర్హులైనవారికి నెలరోజుల్లో పెన్షన్ మంజూరు చేయిస్తామ ని మినరల్ వాటర్ అందిస్తామని పేర్కొంటున్నారు. గ్రామంలో ఎవరైన చనిపోతే మృతుని కుటుంబానికి రూ.10వేల నుంచి రూ.20వేల ఆర్థికసాయం, ఇంటి ఆ డబిడ్డ పెళ్లికి రూ. 5వేల నుంచి రూ.10వేల కట్నం అం దిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు.

పేకాట నిలయాలుగా సెగ్రిగేషన్ షెడ్లు....!

(5వ పేజీ తరువాయి)

పర్యవేక్షణ లోపం కారణంగా ఘనమైన లక్ష్యంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా దర్శన మిస్తున్నాయి. కొన్ని చోట్ల షెడ్లు గ్రామాలకు అత్యంత దూరంగా ఉండటం కూడా లక్ష్యం నెరవేరపోవడానికి కారణాలయ్యాయి. మిగతా చోట్లా కొంతకాలంపాటు షెడ్లు వినియోగంలో ఉన్నప్పటికీ ఆ తరువాత పర్యవేక్షణ పూర్తిగా కొరవడి అలంకార ప్రాయంగా మారాయి.

ఆర్భాటంగా నిర్మించి...

బీఆర్ఎస్ హాయంలో కోట్ల రూపాయలు వెచ్చించి, ఎంతో ఆర్భాటంగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు ఆలనా పాలనా లేక కాల క్రమంలో పేకాటకు నిలయాలుగా మారాయి. జిల్లాలోని అప్పటి వేంపల్లి గ్రామంలో (ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయింది) రూ. 2.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు ఊరికి దూరంగా ఉండటంతో అది ప్రస్తుతం అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రోడ్డు సౌకర్యం కూడా సక్రమంగా లేకపోవ డంతో పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తను సమీపంలోని వాగులు, చెరువల వద్ద పడవేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం షెడ్డు ఆవరణలో పెద్ద మొత్తంలో పేకాట ఆడటం, మద్యం సేవించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఖాళీ మద్యం సీసాలు, పేకాట ముక్కలు దర్శనమిస్తుండటమే దీనికి నిదర్శనం. షెడ్డు వద్ద నిర్మించిన బాత్రూంలో కూడా మద్యం సీసాలతో నిండి పోతోంది. జిల్లా వ్యాప్తంగా నిర్మించిన అన్ని షెడ్ల పరిస్థితి దాదాపుగా అలానే ఉంది. పర్యవేక్షణ లోపం కారణంగా జిల్లా వ్యాప్తంగా సెగ్రిగేషన్ షెడ్లు నిర్మా నుష్యంగా మారగా, కోట్లాది రూపా యలు వెచ్చించిన ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరడం లేదు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఓటర్లకు సూచనలు చేస్తున్న ఏసీపీ ప్రకాష్

జన్నారం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన కవ్వాల, బంగారు తండ, హాస్టల్ తండా రేండ్లగూడ, చింతగూడ, తలమడుగు పోలింగ్ కేంద్రాలను ఆదివారం మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. నిఘా వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలన్నారు. ఆయన వెంట లక్షెట్టిపేట సీఐ రమణామూర్తి, ఎస్ఐ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ రెస్క్యూ పోటీల్లో సత్తా చాటిన సింగరేణి..

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రెస్క్యూ పోటీల్లో సింగరేణి సత్తా చాటింది. ఈనెల 2న నాగ్‌పూర్‌లో ప్రారంభమైన 54వ జాతీయ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీలు ఆదివారంతో ముగిశాయి. అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సింగరేణి బీ జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ని కైవసం చేసుకుని ప్రథమ బహుమతిని దక్కించుకున్నది. ఈపోటీలకు సింగరేణి నుంచి మూడు (రెండు పురుషుల జట్లు, ఒక మహిళా జట్టు) పాల్గొన్నారు. మహిళా జట్టు ఓవరాల్ ద్వితీయ స్థానం సాధించగా, సింగరేణి ఏ జట్టు నాలుగవ స్థానంలో నిలిచింది. ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ థియరీ, రెస్క్యూ రిలే స్టాట్యుటరీ, డ్రిల్ పరేడ్ విభాగాల్లో సింగరేణి బీ జట్టు ప్రథమ స్థానం సాధించింది. మహిళా విభాగంలో ఉత్తమ కెప్టెన్‌గా కృష్ణవేణి, ఉత్తమ రెస్క్యూ సభ్యురాలిగా గాయత్రి, ద్వితీయ ఉత్తమ సభ్యురాలిగా మౌనికలు నిలిచారు. పురుషుల విభాగంలో ఉత్తమ కెప్టెన్‌గా ప్రమోద్, ఉత్తమ రెస్క్యూ సభ్యులుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో భానుప్రసాద్, ఎస్ మధు, ఏ శ్యాంలు బహుమతులు సాధించారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


దేవాపూర్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

కాసిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. ఆదివారం మండలంలోని దేవాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్య నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు ప్రతి రోజు స్లిప్ పరీక్షలు నిర్వహించాలన్నారు. చదువులో వెనకబడిన పిల్లలను గు ర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయు లందరు సమిష్టిగా కష్టపడి పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులందరు సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. అనంతరం భోజనం, తాగునీరు, కాస్మోటిక్స్ సరిగ్గా అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కండేయస్వామికి పంచామృతాభిషేకం


ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో పద్మశాలి భవనంలో శ్రీభక్త మార్కండేయస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకోని ఆదివారం ప్రత్యేక పూజలు జరిపించారు. భీమండి చెందిన పురోహితులు నంబయ్య, ఆలయ అర్చకులు కిషన్‌ల ఆధ్వర్యంలో గణపతి, గౌరీపూజ, స్వస్తీవాచనము, నిత్య ఆరాధన, పుణ్యహవాచనము, మహాహరతి మంత్రపుష్పం, మహాదాశీర్వచనం, మహా ప్రసాద వితరణ చేశారు. ఆలయంలో కలమడుగు చెందిన జొన్నల శంకరయ్య బృందం వారిచే భగవద్గీత పారాయణం చేపట్టారు. భక్తులు మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దండేపల్లి పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శంకర్, మండల అధ్యక్షుడు వంగ శంకరయ్య, మండల, పట్టణ పద్మశాలి సంఘం నాయకులు, కమిటీ సభ్యులు, పద్మశాలి కులబంధువులు, భక్తులు పాల్గొన్నారు.

పోరాటాలు చేసి బీసీల హక్కులను సాధిస్తాం


మంచిర్యాలలో నినాదాలు చేస్తున్న బీసీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంతో పోరాటాలు చేసి బీసీ హక్కులను సాధిస్తామని బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ ఒడ్డేపల్లి మనోహర్, స్వర్ణకారుల సంఘం పట్టణాధ్యక్షుడు రమేష్‌లు పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకపో వడాన్ని నిరసిస్తూ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సాయీశ్వరచారి మృతికి ఆదివారం రాత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదాంబ కాంప్లెక్స్ నుంచి ఐబీ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రెండేళ్లుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్ని ఉద్యమాలు చేసినా చివరకు బీసీలకు నిరాశే మిగిలిందన్నారు. వెంటనే బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు శ్రీనివాస్, సాగర్, విజయ్, శ్రీనివాస్, కె. శ్రీనివాస్, రమేష్, భవానీ, క్రాంతి, బుచ్చయ్య, మల్లేష్, నాగరాజు, కిరణ్, రవిరాజా, బ్రహ్మాచారి, రాజేష్, తిరుపతి, శోభన్, రమేష్, హరీష్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును.. వినియోగించుకోవాలి


భీమినిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

భీమిని, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తాండూర్ సీఐ దేవయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంతో పాటూ కేస్లాపూర్ గ్రామాల్లో పోలీస్‌ల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరి గేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో భీమిని, కన్నెపల్లి, మాదారం ఎస్సైలు విజయ్ కుమార్, భాస్కర్ రావు, సౌజన్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

కన్నెపల్లి: మండలంలోని వీగాం, నాయకునిపేట, కన్నెపల్లి గ్రామాల్లో ఆదివారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రశాంతంగా ప్రచారాన్ని చేసుకోవాలన్నారు. యువకులు ఎలాంటి గొడవల్లో తలదూర్చవద్దని, ఒక్క సారి కేసులు నమోదైతే భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు రావని, ఇబ్బందులు పడతారని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ దేవయ్య, కన్నెపల్లి, మాదారం, భీమిని ఎస్ఐలు భాస్కర్‌రావు, సౌజన్య, విజయ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.


కన్నెపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్

కాసిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఆదివారం కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం, కాసిపేట, ముత్యంపల్లి, మామిడిగూడెంలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు ఎవరికి భయపడకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు ప్రచారంలో బెదిరింపులు, గొడవలు, అనవసర ప్రేరేపణలు, ఓటర్లను ప్రభావితం చేసే చట్టవిరుద్ధ చర్యలు చేయ రాదన్నారు. సోషల్ మీడియా వాట్సాప్ గ్రూపులు, ఫేస్ బుక్‌లు నిర్వహించే అడ్మిన్లు తప్పుడు ప్రచారం చేయరాదన్నారు. విద్వేష పూరిత సందేహాలు, ఎన్నికల ప్రక్రియను భంపరిచేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్య లుంటాయన్నారు. వాట్సప్ గ్రూపుల్లో తప్పుడు సమాచారం చేరవేసి అల్లర్లకు కారణమైన వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ఎన్నికల సమయంలో యువకులు అల్లర్లలో తలదూర్చి అనవసరంగా జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ఒక్కసారి కేసు నమోదైతే ఇక అంతే సంగతులన్నారు.

ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.


సోమగూడెంలో మాట్లాడుతున్న పోలీసులు

సొంత గిడ్డంగి ఉన్నా..అద్దె భవనంలోనే

- సివిల్ సప్లయీస్ అధికారుల నిర్లక్ష్యం
- శిథిలావస్థకు చేరిన సొంత గోదాం
- అద్దె భవనానికి వేల రూపాయలు చెల్లింపు


నిరుపయోగంగా ఉన్న సివిల్ సప్లై సొంత గిడ్డంగి

లక్షెట్టిపేట, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట సివిల్ సప్లే అధికారుల పని తీరు పలు విమర్శలకు దారి తీస్తోంది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లే గిడ్డంగి ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలోనే ఉంటోంది. లక్షల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం సివిల్ సప్లై గోదాం కోసం స్వంత భవనం నిర్మించినా అధికారులు మాత్రం వేలకు వేలు చెల్లించి అద్దె భవనంలోనే కొనసాగించంలో ఆంతర్యం ఏమిటో ఎవరికీ అంతు పట్టడం లేదు.

26ఏళ్ల క్రితం గోదాం నిర్మాణం...

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి నుంచి లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మూడు మండలాల్లోని అన్ని గ్రామాలకు రేషన్ సరుకులు సరఫరా చేస్తారు. 26 ఏళ్ల క్రితం సుమారు రూ.8లక్షలు వెచ్చించి లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ పక్కన అప్పటి ప్రభుత్వం గోదాం నిర్మాణం చేపట్టి సివిల్ సప్లే అధికారులకు అప్పగించింది. కానీ సంబంధిత అధికారులు స్వంత భవనాన్ని వినియోగించకుండా నెలకు రూ.13వేలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు చెల్లిస్తూ గోదాంలో సివిల్ సప్లై సరుకులు బద్రపరిచి ఇక్కడి నుంచి మూడు మండలాలకు, వివిధ వసతిగృహాలకు, పాఠశాలలకు నిత్యం సరుకులు పంపిస్తున్నారు.

గోదాంలు లేక రైతుల తిప్పలు..

లక్షెట్టిపేట మండలంలో రైతులు ధాన్యం బద్రపర్చుకునేందుకు సరిపడా గిడ్డంగులు లేక తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యానికి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు అనే ఉద్దేశ్యంతో గోదాంలను నిర్మించినప్పటికీ ఇక్కడ ఉన్న గిడ్డంగులు మాత్రం రైతుల కోసం ఉపయోగపడడం లేదు.


అధికారులు వినియోగిస్తున్న మార్కెట్‌యార్డులోని అద్దె భవనం

ధాన్యం కొనుగోళ్ల సమయంలో వాతావరణం అనుకూలించక రైతులు కేంద్రాల్లో కుప్పల కొద్ది పోసి వాటిపై కవర్లు కప్పుకుంటూ కాపలాగా ఉన్న కూడా అధికారులు మాత్రం గోదాంలను అద్దెలకు ఇస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్వంత భవనాన్ని వినియోగించుకుంటూ ప్రభుత్వ సొమ్ము వృధా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

స్వంత భవనాలను ఉపయోగించుకోవాలి...

రవికిరణ్, ఏఐటీయూసీ నాయకుడు, లక్షెట్టిపేట



ప్రభుత్వాలు ఎవరికి కేటాయించిన భవనాలను వాళ్లే వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలి, రైతుల కోసం నిర్మించిన గిడ్డంగులను వేరే ఉపయోగాలకు అద్దె కోసం ఆశపడి ఇవ్వడం సరికాదు. మన ప్రాంతంలో గిడ్డంగులు లేక రైతులు ప్రతీ ఏటా పంట దాచుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వాళ్ల కష్టాలను మనం నిత్యం కళ్లార చూస్తున్నాం కూడా. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి ఎవరికి కేటాయించిన భవనాలను వాళ్లే ఉపయోగించుకునేలా చూడాలి.

అధికారుల ఆదేశాలతోనే అద్దెకిచ్చాం...

రాజేశ్వర్ మార్కెట్ కార్యదర్శి, లక్షెట్టిపేట

చాలా ఏళ్ల క్రితం నుంచి ఇక్కడి గోదాంను సివిల్ సప్లైకి అద్దెకు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉంది. ప్రస్తుతం నాలుగు గోదాంలు మార్కెట్ యార్డులో ఉన్నాయి. వాటిని మొత్తం వినియోగించుకుంటున్నారు.

కంకర తేలి.. అధ్వానంగా మారి


ప్రమాదకరంగా ఉన్న రహదారి

మందమర్రిరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నా రం గ్రామంలోని రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. ఆదిల్‌పేట నుంచి పొన్నారం వెళ్లే ఈ రోడ్డు కంకర తేలడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడు తున్నారు. ఎన్నో అవసరాల నిమిత్తం నిత్యం ఈ రోడ్డు గుండా వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు. అయితే రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే రోడ్డు పక్కన నాలాలు లేకపోవడంతో రోడ్డుపైకి నీరు చేరుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎన్నికల్లో ఎన్నెన్ని సిత్రాలో..

వార్డు సభ్యుడిగా ఓ ఎంపీటీసీ, సర్పంచ్

సర్పంచ్ బరిలో మాజీ ఎంపీటీసీ

వాంకిడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో మండలంలో ఎన్నెన్నో చిత్ర విచిత్రాలు కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రిజర్వేషన్లు కలిసరాకపోవడంతో ఉపసర్పంచు పదవైనా దక్కించుకోని రాజకీయంగా గుర్తింపు ఉండేలా చూడాలని మండలంలో అనేక మంది మాజీలు వార్డు సభ్యులకు నామినేషన్లు విశేషం. మండలంలోని ఖమన గ్రామ పంచాయతీలో ఓ మాజీ ఎంపీటీసీ వార్డు సభ్యుడిగా, సరండి పంచా యతీలో ఓ మాజీ సర్పంచ్ వార్డు సభ్యుడిగా, మండల కేంద్రంలో ఓ మాజీ ఎంపీపీ తనయుడు వార్డు సభ్యుడిగా నామినేషన్ వేయగా బంబార పంచాయతీలో ఓ మాజీ ఎంపీటీసీ సర్పంచ్‌కు నామినేషన్ వేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మండలంలోని గిరిజన పంచాయతీల్లో గతంలో ఉన్న రిజర్వేషన్లు అనూకూలించని చోట మాజీ సర్పంచులు తమ భార్యలను బరిలో దించి గెలుపుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

నాడు సతి... నేడు పతి..

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికకు నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఒకే కుటుంబంలోని వారికి పదవులు వరిస్తున్నాయి. మండంలోని గుండి గ్రామపంచాయతీని 2019లో బీసీ మహిళకు కేటాయించడంతో జాబరి అరుణ సర్పంచ్‌గా గెలుపొందారు. 2025లో గుండి సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించడంతో అరుణ భర్త జాబరి రవిందర్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే మోతుగూడ సర్పంచ్ స్థానం 2019లో జనరల్ మహిళకు కేటాయించారు. ఈర్దండి సువర్ణ సర్పంచ్‌గా గెలుపొందారు. 2025లో మోతుగూడ సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించడంతో సువర్ణ భర్త ఈర్దండి వినోద్ నామినేషన్ దాఖలు చేశారు. రౌటసంకెపల్లి సర్పంచ్ స్థానం 2019లో ఎస్టీ మహిళకు కేటాయించారు. ఈట్యాల విమల సర్పంచ్‌గా గెలుపొందారు. 2025లో రౌటసంకెపల్లి సర్పం చ్ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో విమల భర్త కిష్టయ్య నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నికల ఖర్చుకు స్నేహితుల విరాళం

పెంచికలపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన వ్యక్తికి ఆదివారం ఎన్నికల ఖర్చు నిమిత్తం స్నేహితులు, యువకులు ముందుకు వచ్చి విరాళాలు వేసుకుని కొంత మొత్తం నగదును అందజేశారు. ప్రజలకు సేవ చేయలని దృడ సంకల్పంతో బరిలో ఉండడాన్ని స్వాగతిస్తున్నామని, అతడిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

సిర్పూర్(టి), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల షేక్మాద్‌గూడకు చెందిన బీజేపీ నాయకులు శంకర్, కుషాబ్‌రావు, నానాజీలు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

కాగజ్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందదని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన దండె విఠల్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

కాగజ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఉన్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కేంద్ర నిధుల తోనే సాధ్యపడుతుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ బలపరిచే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

పంచాయతీలకు గూడు కరువు

- కాబోయే సర్పంచ్‌లకు పరీక్షే
- పాఠశాలలు, ఇతర భవనాల్లో ఇంకెన్నాళ్లు
- మహిళలకూ తప్పని అవస్థలు
- నిధులు మంజూరైనా స్థలాల కొరత
- కొత్త పాలకవర్గాలపైనే భారం



జిల్లాలో పలు చోట్ల కొత్తగా గెలిచే సర్పంచ్‌లకు పాలన పగ్గాలు చేపట్టేందుకు సొంత భవనాలే కరువయ్యాయి. పలు చోట్ల పాఠశాలలు, ఇతర భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. దీంతో పంచాయతీ సమావేశాలు నిర్వహించేందుకు పాలవర్గ సభ్యులు అవస్థలు పడుతున్నారు.

బెజ్జూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఇప్పటికే నామినేషన్లు వేసిన అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. బరిలో నిలిచిన అబ్యర్థులు ప్రచార జోరు పెంచారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడం ఆయా అభ్యర్థులకు పరీక్షగా మారింది. అద్దె, ఇతర భవనాల్లో అరకొర వసతుల మధ్య కొత్త పాలకవర్గా లకు స్వాగతం పలకనుండడం వారికి ఆరంభంలోనే అవస్థలకు గురి చేయనున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల సరిపడా స్థలం లేక సమావేశాలు రచ్చబండ వద్ద, చెట్లకింద నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది వరకు ఉన్న పంచాయతీలకు కొంత ఇబ్బంది లేకపోయినా ఆరేళ్ల కిందట ఏర్పడిన పంచాయతీ లకు సొంత గూడు కరువైంది. ఉపాధిహామీ ని. దుల కింద ఒక్కో భవనానికి రూ.20లక్షలు మం జూరు చేసినా బిల్లులు సకాలంలో రావనే భావ నతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు నిరాసక్తత ప్రదర్శించడం సర్పంచ్‌లు చొరవ తీసుకున్న చోట నిధులురాక పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

జిల్లాలో పరిస్థితి ఇలా..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 335గ్రామ పంచాయతీలు ఉండగా, జిల్లాలోని 52 గిరిజన పంచాయతీల భవనాల నిర్మాణాలకు ఒక్కో దానికి రూ.20లోల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వీటిలో కొన్నింటికి స్థలాల కొరతతో పనులు ప్రారంభించ లేదు. ప్రారం భమైన చోట తదుపరి బిల్లులు రాక అర్ధంతరంగానే నిలిచిపోయాయి. రెండేళ్లు కావస్తున్నా నిధులు రాక అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో ఆయా పంచాయ తీల్లో పాలక వర్గాలకు సమావేశాలు నిర్వహించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది.

దశాబ్దాల క్రితం ఏర్పాటైన వాటికీ..

దశాబ్దాల కిందట ఏర్పడిన గ్రామాలదీ ఇదే పరిస్థితి. పలుచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరు కున్నాయి. మరికొన్ని పాఠశాలలు, ఇతర భవనా ల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో పల్లె పాలనకు ఆటంకాలు తలెత్తుతున్నాయి. ఇక రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో జోరుగా ప్రచారం కూడా కొనసాగుతోంది. మరో పది రోజుల్లో కొత్త పాలకవర్గాలు ఏర్పడుతు న్న నేపథ్యంలో వారికి సవాళ్లు దర్శనమిస్తున్నాయి. కొత్తగా కొలువుతీరే పాలకవర్గాలైనా భవనాల నిర్మా ణాల ఏర్పాటుకు పాటుపడాలని ప్రజలు కోరుతు న్నారు.

కొత్తగా 162 ఏర్పాటు..

జిల్లాలో 162 పంచాయతీలు కొత్తగా ఏర్పాటయ్యాయి. పాత పంచాయతీలు శిథిల భవనాల్లో కొనసాగు తుండగా, కొత్తగా ఏర్పడ్డవి ఐదేళ్లు గడిచినా సొంత భవనాల కు నోచుకోలేదు. దీంతో చాలా పంచాయతీలు పాఠశాల భవనాలు, ఇతర వాటిల్లో కొనసాగుతు న్నాయి. వీటిలో మూత్రశా లలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అధికారులు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళా అధికా రులు, సర్పంచులు ఉన్నచోట ఇబ్బందు లు అనేకం. మరోవైపు కార్యాలయానికి తగ్గట్లుగా భవనాలు లేక, సమావేశాల నిర్వహణ, రికార్డులు, సామగ్రి భద్రతకు రక్షణ లేకుండా పోయింది. పంచాయ తీలు ఏర్పడి ఇన్నేళ్లు కావస్తున్నా భవనాలు నిర్మంచడం లేదని చెబుతున్నారు.

బీజేపీలో చేరిక

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం తుంపల్లి బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్, ఇతర సభ్యులతో కలిసి ఆదివారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దత్తు, రాము, కౌసల్య, అంబారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు అవగాహన

కెరమెరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రంతో పాటు గోయగాం, సావర్‌ఖేడ, మోడి తదితర గ్రామాల్లో ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆవశ్యకతపై గ్రామస్థులకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ కోటేశ్వర్‌జీ ఆదివారం అవగాహన కల్పించారు. పలవు విషయాలపై వివరించారు. కార్యక్రమంలో సభ్యులు ధన్‌రాజ్, మోతిరాం, శివాజీ, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ టోర్నీకి క్రీడాకారుల వేలం

కౌటాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో రెండో సీజన్ జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న కేపీఎల్ టోర్నీకి క్రీడాకారులను వేలం ద్వారా ఎంపికను ఆదివారం నిర్వహించారు. ఇందులో ఒక్కో క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా వేలం పాడారు. ఒక్కో ప్రాంచేజీలు 17 మంది క్రీడాకారులను వేలం ద్వారా దక్కించుకున్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన ప్రాంచేజీ(టీం)లకు మొదటి బహుమతిగా రూ.1.10 లక్షలు, రెండో బహుమతిగా రూ.55 వేల నగదును అందించనున్నారు. ఈ క్రీడాకారుల ఎంపికలో కేపీఎల్ నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత ఎన్నికలకు

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంల నుంచి మొదటి విడత పోలింగ్ నిర్వహించే లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూరు, కెరమెరి, వాంకిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎంపీవోలు, జోనల్ అధికారులతో ఆదివారం జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో భాగంగా ఈ నెల 11న నిర్వహించే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలో అన్ని ఏర్పాట్లు చేయాలని, సరిపడా కుర్చీలు, టేబుళ్లు, వెలుతురు సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది ముందు రోజు సాయం త్రం 4 గంటలకు అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఎన్నికల్లో ఉపయోగించే సామగ్రి, కవర్లు, పేపర్లు అన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పత్రాలను సరి చూసుకోవాలని, ఎన్నికల సామగ్రి పంపిణీకి కేంద్రంలో బ్యాలెట్ పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూం వద్ద బందో బస్తు ఏరాపట్లు చేయాలని చెప్పారు. సామాగ్రి పంపిణీ కేంద్రం వద్ద కౌంటర్లు ఏరాపటు చేసి రద్దీ లేకుండా చూసుకోవాలని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం పంపిణీ కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి తాగునీరు, అల్పాహారం, భోజన సమయానికి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

అందించాలని, జోనల్ అధికారులు తమ రూట్ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించాలని తెలిపారు. స్టేజ్-2 ఆర్వోలకు మరో సారి శిక్షణ ఇవ్వాలని, పీవో, ఓపీవోలకు ఈ నెల 9 తేదీన ఎన్నికలకు జరిగే మండల కేంద్రాలలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ అందించాలని సూచించారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ కేంద్రానికి చేరుకొని రిపోర్టు చేసేలా చూడాలని, రూట్ల వారీగా అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. పూర్తి బందో బస్తు మధ్య ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా చేపట్టేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎందుకొచ్చిన గొడవ

- పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై ఉద్యోగుల నిరాసక్తి
- లెక్కింపులో ఎవరికి ఓటు వేశారనేది బహిర్గతమయ్యే అవకాశం



కౌటాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ప్రతిసారీ ఎలక్షన్లు కొత్త చిక్కును తెచ్చిపెడుతున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకునే ఉద్యోగులు, ఉపాధ్యాయులు తక్కువ సంఖ్యలో ఉండడం వల్ల ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల ఎవరు ఎవరికి ఓటు వేస్తారో వెల్లడయ్యే అవకాశాలు ఉండవు. కానీ గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల్లో ఆయా గ్రామాల పరిధిలో ఉండే ఉద్యోగులు, ఉపాధ్యాయులు తక్కువ సంఖయలో ఉండడం తక్కువ మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవడం వల్ల తాము ఎవరికి ఓటు వేస్తామో బహిగ్గతమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతుంది. కొన్ని గ్రామ పంచాయతీల్లో పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా ఓట హక్కును వినియోగించుకునే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఒక్కరో, ఇద్దరో ఉంటారు. తమ ఓటు హక్కును వారు పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు సంబంధిత గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారులకు దరఖాస్తు చేసుకుని బ్యాలెట్ పత్రాన్ని పొంది తమకు నచ్చిన వ్యక్తికి సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల పదువులకు పెన్నుతో టిక్ చేయాల్సి ఉంటుంది.

వాటిని పోలింగ్‌కు ముందే సంబంధిత గ్రామపంచాయతీ ఎన్నికల అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఓట్ల లెక్కింపు సమయంలో ఆ పోస్టల్ బ్యాలెట్లను లెక్కించడం వల్ల ఆ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎవరికి ఓటు వేశారో బహిర్గతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండడం వల్ల తాము పార్టీ నాయకులకు, పోటీల్లో ఉన్న అభ్యర్థులకు తాము ఎవరికి ఓటు వేశామన్నది వెల్లడి కావడ వల్ల ఆ ఉద్యోగులపై కక్షలు పెంచుకునే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. తక్కువగా ఉన్న పోస్టల బ్యాలెట్‌లను ఏ ఉద్యోగి, ఉపాధ్యాయుడు వినియోగించుకున్నాడో స్పష్టంగా వెల్లడి కావడంతో తమ ఓటు రహస్యంగా ఉండే ఆస్కారం లేదని వాపోతున్నారు. గతంలో కొన్ని గ్రామాల్లో ఒకరిద్దరు పోస్టల్ బ్యాలెట్‌లు వినియోగించుకోవడం వల్ల ఓటు రహస్యం బహిర్గతమై ఓటు పొందిన వారి నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చిందని తెలిపారు. అలాగే ఓ రాజకీయ పార్టీ నాయకులకు చాలా కాలం టార్గెట్‌గా మారాల్సి వచ్చిందని కొందరు ఉపాధ్యాయు లు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టల్ బ్యాలెట్‌లను సైతం సాధారణంగా ఓటు హ క్కు వినియోగించుకునే బ్యాలెట్ బాక్సుల్లోనే వేస్తున్న బ్యాలెట్ పరతాలతో పాటు పోస్టల్ బ్యాలెట్‌లను కూడా వేయడం ద్వారా ఓటు రహస్యాన్ని కాపాడేందుకు అవకాశం ఉంటుందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అలా వీలు కాని పక్షంలో ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెంట్‌లను లెక్కించడం వల్ల గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలను ఒకటి రెండు ఓట్ల తేడాతో ప్రభావితం చేసే పరిణామాలు ఉండడంతో పోస్టల్ బ్యాలెట్ వినయో గించుకోవాలని భావిస్తున్న వారు ఆందోళనలో కూరుకు పోయారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో రాజకీయ కక్షలు, నామినేషన్‌ల దాఖలు సమయంలోనే ఘర్షణలు, బెదిరింపులు, దాడులు జరగడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో పోస్టల్ బ్యాలెట్ల వినియోగదారులు ఆందోళన చెందాల్సి వస్తుందని ఉపాధ్యాయ సంఘాలు సైతం ఆందోళన చెందుతున్నాయి. ఎన్నికల అధికారులు ఈ పరిణామాలను గమనంలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ బహిర్గతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఓటు రహసాయన్ని కాపాడాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

సిర్పూర్(యు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జైనూర్ సీఐ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ చౌక్‌లో జైనూర్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నిక నియమావళిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక నిబంధనలను కచ్చితంగా పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎన్నికలు పారదర్శకంగా,స్వేచ్ఛగా జరిగేందుకు తన ఓటును ఎటువంటి భయాందోళనలు లేకుండా వినియోగించాలని సూచించారు. ప్రత్యేకంగా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు డబ్బు, మద్యం ప్రలోభాలు, బెదిరింపులు కలిగించడం వంటి చర్యలపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన హక్కు కావడంతో దాన్ని నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు విభాగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ, లింగాపూర్ ఎస్సై గంగన్న, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జైనూర్ సీఐ రమేశ్ లింగాపూర్ ఎస్సై గంగన్నలు అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పిక్లాతండా తదితరా గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు 50 మంది పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సంధర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదగని సూచించారు. డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కౌటాల సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం బారెగూడ, కుడ, పోతెపల్లి, బెజ్జూరు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలు దారి తీయకుండా చూసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అనవసరమైన వాటని పోస్టు చేయవద్దని అన్నారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమా వళి పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు సర్తాజ్‌పాషా, నరేష్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బెజ్జూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పల్లెల్లో దావత్‌ల జోరు..

- విందులు, వినోదాలతో ఓటర్లకు అభ్యర్థుల గాలం

వాంకిడి/బెజ్జూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పైసామే పరమాత్మ అన్నట్లు...ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని పల్లెల్లో దావత్‌ల జోరు నడుస్తోంది. మొదటి, రెండో విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో పల్లెల్లో ఎన్నికల ప్రచారం హోరెత్తుతుంది. ప్రస్తుతం పత్తి ఏరివేత ఉండడంతో మహిళలు, రైతులు ఉదయం 9 కల్లా చేలకు వెళ్లి పోతున్నారు. దీంతో అభ్యర్థులు ఉదయం 9 లోపు రాత్రి 8 గంటల తరువాత ఇంటిటి ప్రచారం చేస్తున్నారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి గెలిపిస్తే ఇది చేస్తా, అది చేస్తా అంటూ హామీలు ఇస్తూ ఈ ఒక్కసారి చాంస్ ఇవ్వండని కోరుతున్నారు. ఒక చోట నలుగురు కలిసి ఉంటే చాలు... వారికి అభ్యర్థి వచ్చి కావల్సినవి(మందు, మటన్, బిర్యాణి) సమకూర్చుతూ ఆకట్టుకుంటున్నారు.

సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న నాయకులు అధికశాతం ఓట్లు ఉన్న కాలనీల్లో ఇళ్లకు వెళ్లి కులసంఘాల నాయకులతో మంతనాలు చేస్తున్నారు. వారికి ఎదో ఒక ఆశచూపి తమవైపు తిప్పుకోవడం కోసం తంటాలు పడుతున్నారు. ఇక ప్రచారంలో వెంట తిరిగిన వారికి దావత్‌లు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి మందు, మటన్, బిర్యాణిలతో దావత్‌లు ఇస్తున్నారు. ప్రచారానికి వెంట వస్తున్న వారిని తప్పిపోయి ఒక్క పూట వెంట తీసుకువెళ్లకపోతే వారు మరో సర్పంచ్‌అభ్యర్థివైపు వెళ్లెందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో వీరిని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఏదేమైనా సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేసే అభ్యర్థుల వెంట జనాలు దండిగా కనిపిస్తున్నారు.

అభ్యర్థులు నచ్చకుంటే నోటా

వాంకిడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నోటాకు పదిహేనేళ్లు. ఎన్నికల్లో అభ్యర్థులు నచ్చనప్పుడు తెరపైకి వచ్చిన ఆప్షనే నోటా(నన్ ఆఫ్ ది ఎబో). పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే ఆ అభిప్రాయ ం వ్యక్తీకరించే అవకాశం నోటా కల్పిస్తుంది. 2013 వరకు ఓటర్లకు అభ్యర్థులు నచ్చకపోయినా...సరైన అభ్యర్థి పోటీలో లేరని భావించినా ఎవరికో ఒకరికి ఓటేయాల్సిన పరిస్థితి ఉండేది. అదే ఏడాది సెప్టెంబరు 27న దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో నోటా అమల్లోకి వచ్చింది. ఎన్నికల సంఘం ఈవీఎంలలో నోటా బటన్ వచ్చాక మొదటి సారి ఢిల్లీ, రాజస్థాన్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఎన్నికల్లో నోటా ఉంటోంది.